సాక్షి ములుగు

గురువారం । 19 । అక్టోబర్ । 2023

I



జీపీ కార్యాలయంలో ప్రైవేట్ వ్యాపారం

మంగపేట మండల పరిధిలోని నర్సింహాసాగర్ జీపీలో ప్రైవేట్ వ్యక్తులు వైద్య పరీక్షల పేరుతో ఆయుర్వేదిక మందుల వ్యాపారం చేస్తున్నారు.

- IIIలో ▸



రాహుల్ పర్యటనలో పోలీసుల ఓవరాక్షన్

- IIIలో ▸

రాహుల్ గాంధీ రామప్ప పర్యటనలో పోలీసులు అత్యుత్సాహం చూపారు. ఆలయ పరిసరాల్లోకి అనుమతించలేదు.

గరిష్టం/కనిష్టం
33.0^0 / 23.0^0

వాతావరణం

ఉదయం మంచు కురుస్తుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు మామూలుగా ఉంటాయి. సాయంత్రం చల్లగాలులు వీస్తాయి.

హస్తం.. సమరోత్సాహం!

పార్టీ శ్రేణుల్లో జోష్ నింపిన రాహుల్, ప్రియాంకగాంధీ

- ఆదివాసీ గడ్డ రామాంజాపూర్ నుంచి ఎన్నికల శంఖారావం
- రామప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు
- అక్కడి నుంచి బస్సుయాత్ర ప్రారంభం..
- సభలో బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎంలపై అన్నాచెల్లెళ్ల నిప్పులు
- ఆరు గ్యారంటీల అమలుపై ప్రజలకు భరోసా
- నేడు భూపాలపల్లిలో నిరుద్యోగులతో కలిసి బైక్ ర్యాలీ

ఆదివాసీ గిరిజనులతోపాటు అందరికీ ఆరాధ్య దైవాలైన సమ్మక్క, సారలమ్మ జాతర దేశంలోనే అతిపెద్దది. దేశంలో మేం అధికారంలోకి వస్తే జాతరను జాతీయ ఉత్సవంగా ప్రకటిస్తాం. కుంభమేళా తరహాలో నిర్వహిస్తాం.

- రాహుల్‌గాంధీ





ములుగు జిల్లా రామాంజాపూర్ విజయభేరి సభలో అభివాదం చేస్తున్న రాహుల్, ప్రియాంక గాంధీ, హాజరైన కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు

సాక్షిప్రతినిధి, వరంగల్/ ములుగు/ ములుగు రూరల్/వెంకటాపురం(ఎం): ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ పర్యటన కాంగ్రెస్ కేడర్‌లో కొత్త ఉత్సాహం నింపింది. ములుగు జిల్లా రామాంజాపూర్ వద్ద బుధవారం జరిగిన విజయభేరి సభలో తెలంగాణ ఎన్నికల శంఖారావాన్ని పూరించారు. అభ్యర్థులను గెలిపించుకునేందుకు అగ్రనేతలు రాహుల్, ప్రియాంకగాంధీ కాకతీయులు ఏలిన గడ్డ నుంచే పూర్తిస్థాయి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ములుగు, జేఎస్ భూపాలపల్లి జిల్లాల పర్యటనలో భాగంగా బుధవారం సాయంత్రం ములుగు జిల్లా వెంకటాపురం(ఎం) మండలం పాలంపేటలో రామప్ప ఆలయాన్ని సందర్శించిన రాహుల్, ప్రియాంక రామలింగేశ్వరస్వామికి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాశస్త్యాన్ని తెలుసుకున్న వారు అక్కడి నుంచి అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా బస్సుయాత్ర ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన నాయకులు, కార్యకర్తలతో కలిసి బస్సుయాత్ర ద్వారా రామప్ప ఆలయం నుంచి రామాంజాపూర్ విజయభేరి సభ వద్దకు చేరుకున్నారు. బహిరంగ సభలో ప్రసంగించిన రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎంలపై నిప్పులు చెరిగారు. కాంగ్రెస్‌ను ఓడించడం కోసం బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎంలు కూటమిగా పని చేస్తున్నాయని ఆరోపించారు. ఈ రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రావాలని బీజేపీ కోరుకుంటోందని, అందుకే విపక్ష నేతలందరిపై సీబీఐ, సీఐడీ, ఈడీ దాడులు చేయించి కేసులు పెట్టిన కేంద్రం అవినీతికి కేరాఫ్‌గా మారిన కేసీఆర్‌పై ఒక్క కేసు పెట్టలేదని విమర్శించారు. ఆదివాసీ గిరిజనులు, ఎస్సీ, బీసీ, మైనార్టీ వర్గాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిపై దుమ్మెత్తి పోశారు. బహిరంగ సభలో మహిళా డిక్లరేషన్‌ను ప్రకటించిన ప్రియాంకగాంధీ అధికారంలోకి వచ్చాక ప్రతీ మహిళకు నెలకు రూ.2,500 అందజేస్తామన్నారు. 18 ఏళ్లు నిండిన యువతులకు ఎలక్ట్రిక్ స్కూటీలను ఇస్తామని, రూ.500కే గ్యాస్ సిలిండర్ పంపిణీ చేస్తామని ప్రకటించారు. కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ నింపేందుకు అన్నాచెల్లెళ్లు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అభివృద్ధి పథకాలను వివరిస్తూ.. తెలంగాణలో అమలు చేయనున్నామని ప్రకటించారు. రాహుల్ ప్రసంగిస్తున్న సమయంలో పీఎం.. పీఎం రాహుల్ అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. కాంగ్రెస్ అగ్రనేతల పర్యటన సందర్భంగా ములుగు ఎస్పీ గాష్ ఆలం భారీగా భద్రత ఏర్పాట్లు చేశారు.

జనసంద్రంగా మారిన రామాంజాపూర్

రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ హాజరైన కాంగ్రెస్ విజయభేరి సభ సందర్భంగా రామాంజాపూర్ జనసంద్రంగా మారింది. ఇటు సీతక్క, అటు గండ్ర సత్యనారాయణ అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావడంతో గ్రామ పరిసరాలు కార్యకర్తలతో హోరెత్తాయి. ఇటీవల కురిసిన వర్షాలతో ఇబ్బందులు పడిన దొడ్ల, మొందాయి, మల్యాల, మేడారం, ఊరట్టం తదితర గ్రామాల నుంచి ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారు. రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తున్న సమయంలో 'సీఎం.. సీఎం' అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్న సమయంలో సీతక్కను దగ్గరకు తీసుకుని ఈమె ఎవరో తెలుసా.. నా సోదరి అంటూ నాలుగు సార్లు ఉచ్చరించి సభలో నూతన ఉత్తేజాన్ని నింపారు. కాంగ్రెస్ పార్టీ గ్యారంటీలపై ప్రజలను అభిప్రాయాన్ని అడగ్గా.. సానుకూలంగా స్పందించారు. సభలో పార్టీ తెలంగాణ ఇన్‌చార్జ్ మాణిక్కం ఠాకూర్, టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కుందూరు జానారెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు ధనసరి సీతక్క, డి.శ్రీధర్‌బాబు, నాయకులు మధుయాష్కీగౌడ్, మల్లు రవి, తూర్పు జగ్గారెడ్డి, భూపాలపల్లి కాంగ్రెస్ అభ్యర్థి గండ్ర సత్యనారాయణ, కొండా సురేఖ, నాయిని రాజేందర్‌రెడ్డి, వేం నరేందర్‌రెడ్డి, సిరిసిల్ల రాజయ్య, రాఘవరెడ్డి, పొదెం వీరయ్య, ఎర్రబెల్లి స్వర్ణ, మల్లాడి రాంరెడ్డి పాల్గొన్నారు.

స్వాగతం పలికిన రాష్ట్ర నేతలు

రామప్పలోని హెలిపాడ్ వద్ద అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీలకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే సీతక్క, భూపాలపల్లి కాంగ్రెస్ అభ్యర్థి గండ్ర సత్యనారాయణతోపాటు పలువురు నేతలు బొకేలు అందించి స్వాగతం పలికారు. రామప్ప ఆలయం ముందు అగ్రనేతలకు కోయ కళాకారులు కొమ్ము డాన్స్, గిరిజనులు లంబాడా నృత్యం ద్వారా స్వాగతం పలికారు.





ప్రచార రథంపై రాహుల్, ప్రియాంక గాంధీ, సభలో మాట్లాడుతున్న రాహుల్‌గాంధీ, వేదికపై ప్రియాంక, రేవంత్, భట్టి తదితరులు

రామప్పలో పూజలు..



ప్రపంచ ప్రసిద్ధి చెందిన రామప్ప దేవాలయాన్ని బుధవారం సాయంత్రం కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ సందర్శించారు. రామప్పకు సాయంత్రం 4 గంటలకు వారిద్దరు రావాల్సి ఉండగా, 37నిమిషాలు ఆలస్యంగా వచ్చారు. ఆలయ అర్చకులు హరీష్‌శర్మ, ఉమాశంకర్ పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆలయంలోకి ఆహ్వానించారు. రామలింగేశ్వరస్వామికి వారు పూజలు నిర్వహించగా పూజారులు ఆశీర్వచనం అందించి శాలువాలతో సత్కరించారు. అనంతరం వారు ఆలయం చుట్టూ కలియదిరిగారు. టూరిజం గైడ్ విజయ్‌కుమార్ ఆలయ విశిష్టత గురించి వివరించారు.

పర్యటన సాగిందిలా..



- రామప్పకు బుధవారం సాయంత్రం 4 గంటలకు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ రావాల్సి ఉండగా, 37 నిమిషాలు ఆలస్యంగా హెలికాప్టర్ ద్వారా చేరుకున్నారు.
- అక్కడి నుంచి ప్రత్యేక కాన్వాయ్‌లో రామప్ప ఆలయ ప్రధాన గేటు వద్దకు 4:43 గంటలకు చేరుకున్నారు.
- కాలినడకన రామప్ప ఆలయానికి 4:45 గంటలకు చేరుకున్నారు.
- 4:46 నుంచి 5:02 నిమిషాల వరకు రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు జరిపారు.
- 5:03 నుంచి 5:17 వరకు రామప్ప ఆలయ విశిష్టత గురించి గైడ్ విజయ్‌కుమార్ వివరించారు.
- 5:25 గంటలకు రామప్ప గేట్ వద్ద బస్సు యాత్రకు శ్రీకారం చుట్టి ఎన్నికల శంఖారావాన్ని పూరించారు. అక్కడి నుంచి కాంగ్రెస్ కార్యకర్తల మధ్య రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ బస్సు యాత్ర రామాంజాపూర్ బహిరంగ సభ వద్దకు కొనసాగింది.
- 5.48 గంటలకు: రామాంజాపూర్‌లో ఏర్పాటు చేసిన విజయభేరి సభావేదికపైకి చేరుకున్నారు.
- సభకు పొన్నం ప్రభాకర్ అధ్యక్షత వహించారు.
- వేదికపైకి కొండా సురేఖ, సీతక్క బతుకమ్మలు తీసుకొచ్చి అందజేశారు. అదేవిధంగా మేడారం సమ్మక్క, సారలమ్మ చిత్రపటాన్ని బహూకరించారు.
- 6.11 నుంచి 6.49 గంటల వరకు ప్రియాంక గాంధీ ప్రసంగించారు. మహిళలు పెద్ద ఎత్తున కేరింతలు కొట్టారు.
- 6.50 నుంచి 7.10 గంటల వరకు రాహుల్‌గాంధీ ప్రసంగం కొనసాగింది.
- అగ్రనేతలిద్దరూ హిందీలో ప్రసంగించగా.. నల్లగొండ ఎంపీ, సీనియర్ నేత ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలుగులో అనువదించారు.
- 7.15 గంటలకు బస్సు ఎక్కి భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూరు వైపు వెళ్లారు.
- 8.39 నిమిషాలకు భూపాలపల్లి గణపురం పరిధిలోని జెన్‌కో గోదావరి గెస్ట్‌హౌస్‌కు చేరుకున్నారు.





రామప్ప వద్ద కొమ్ము, డప్పు కళాకారుల ప్రదర్శన, ఆలయంలో నంది విగ్రహం వద్ద అన్నాచెల్లెళ్ల ఫొటో..



ఇద్దరినీ 50 వేల మెజార్టీతో గెలిపించాలి
టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

చివరి శ్వాస వరకు ప్రజల్లోనే ఉంటా..
ములుగు ఎమ్మెల్యే సీతక్క

- IIలో ▸

భూపాలపల్లికి చేరుకున్న రాహుల్‌గాంధీ

కేటీపీపీ అతిథి గృహంలో బస

భూపాలపల్లి/భూపాలపల్లి అర్బన్: రాహుల్, ప్రియాంకగాంధీ బుధవారం రాత్రి భూపాలపల్లి జిల్లాకు చేరుకున్నారు. చెల్పూరు కేటీపీపీ అతిథి గృహంలో బస చేశారు. ప్రత్యేక గదిలో రాహుల్ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, పలువురు రాష్ట్రస్థాయి నాయకులతో కాసేపు ముచ్చటించారు. రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై సమీక్షించారు. అనంతరం డైనింగ్ హాల్‌లో రాత్రి భోజనంలో కొంచెం బిర్యానిని టేస్ట్ చేసి మటన్ కబాబ్ తీసుకున్నారు. అలాగే చిన్న పుల్కాతో పాలక్ పప్పు తీసుకొని భోజనాన్ని ముగించారు.

నేటి కార్యక్రమాలు..

రాహుల్‌గాంధీ గురువారం ఉదయం 7 గంటలకు కేటీపీపీ అతిథి గృహం వద్ద వివిధ రాజకీయ పార్టీల నాయకులకు పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి సాదరంగా ఆహ్వానిస్తారు. అనంతరం కేటీపీపీ ఉద్యోగులతో మాటాముచ్చట చేసి, వారి సమస్యల్ని అడిగి తెలుసుకుంటారు. అక్కడి నుంచి భూపాలపల్లి పట్టణంలోని బాంబుల గడ్డ వరకు నిరుద్యోగులతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహిస్తారు. ఆ తర్వాత పెద్దపల్లి జిల్లాకు వెళ్తారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాలే గెలిపిస్తాయి..



ప్రజలకు అభివాదం చేస్తున్న నాగజ్యోతి

జెడ్పీ వైస్ చైర్ పర్సన్ బడే నాగజ్యోతి

ఏటూరునాగారం: బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రభుత్వ సంక్షేమ పథకాలే తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తాయని జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీ నరసింహారావు, ఏటూరునాగారం మండల అధ్యక్షుడు గడదసు సునీల్‌కుమార్‌లతో కలిసి ఆమె బుధవారం ఏటూరునాగారంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా ఓడగూడెంలోని ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు, యువకులు బతుకమ్మలతో నాగజ్యోతికి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం నాగజ్యోతి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధే తన ప్రచారానికి హస్త్రాలని, కళ్ల ముందు కనిపిస్తున్న అభివృద్ధిని చూసి తనకు ఓటు వేసి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆప్షన్ సభ్యులు ఎండీ.వలియాబీసలీం, ఎంపీపీ అంతటి విజయనాగరాజు, సీనియర్ నాయకులు తుమ్మ మల్లారెడ్డి, కాకులమర్రి పత్రిబాబు, శివాలయం చైర్మన్ తాడూరి రఘు, హోలీబాబా, ఎంపీటీసీలు కోట నరసింహులు, కుమ్మరి స్వప్న, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌లో పలువురి చేరిక..

ఎస్ఎస్ తాడ్వాయి: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలోని వివిధ పార్టీలకు చెందిన నాయకులు బుధవారం జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఆమె కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బడే నాగజ్యోతి మాట్లాడుతూ కేసీఆర్‌తోనే పేద ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. పార్టీలో చేరిన ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. గత ప్రభుత్వాలు చేసిందేమి లేదని కేసీఆర్ నాయకత్వంలోనే అభివృద్ధి జరుగుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ వైపే ప్రజలు మొగ్గు చూపుతున్నారన్నారు. తన గెలుపునకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యేగా తనకు ఒకసారి అవకాశం కల్పిస్తే అభివృద్ధి చేసి చూపుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం ఆత్మ చైర్మన్ దుర్గం రమణయ్య, గ్రామ కమిటీ అధ్యక్షులు బంగారు సాంబయ్య, ఉప సర్పంచ్ ఇంద్రారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

'పెంచిన వేతనాలు ఎప్పుడు చెల్లిస్తారు'



మహాసభలో మాట్లాడుతున్న రవీందర్

మంగపేట: ప్రభుత్వం మధ్యాహ్న భోజన వంట కార్మికులకు పెంచిన వేతనాలను ఇంకెప్పుడు చెల్లిస్తారని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ ప్రశ్నించారు. మండల కేంద్రంలో యూనియన్ మండల సభ పర్వీణ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. పాఠశాలల్లో 22 ఏళ్లుగా వంట కార్మికులు పనిచేస్తూ విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్న కార్మికులకు ప్రభుత్వం రూ.వెయ్యి మాత్రమే చెల్లించడం సరికాదన్నారు. అనేక పోరాటాల ఫలితంగా రూ.3వేల చెల్లిస్తామని సీఎం కేసీఆర్ 2022 ఫిబ్రవరిలో ప్రకటించారన్నారు. అనంతరం చేసిన పోరాటాలపై స్పందించిన జీఓ నంబర్ 8 విడుదల చేస్తూ వేతనం అందిస్తామని హామీ ఇచ్చినా నేటికీ అమలు కాలేదన్నారు. ఐదు నెలల వంట బిల్లులతో పాటు కోడిగుడ్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దసరా పండుగ వస్తున్నా పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడం దారుణమన్నారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన వంట కార్మికులు రాజకుమారి, పద్మ, జయమ్మ, రాములు, భారతి, లక్ష్మి, అఖిల, శ్రీదేవి, సమ్మక్క, సుధ, సారాభాయి, నాగేంద్ర, తులసి, అమీన తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేయాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగు: ఎన్నిల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి సిబ్బందిని ఆదేశించారు. కలెక్టర్ తన చాంబర్‌లో రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీఓ అంకిత్‌తో కలిసి శాసనసభ ఎన్నికల నిర్వహణపై పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజు చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ విధులకు సిబ్బందిని నియమిస్తూ విధులపై అవగాహన కల్పించాలన్నారు. పోలింగ్ సామగ్రిని సిద్ధం చేసుకోవాలని మార్గనిర్దేశం చేశారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో టాయిలెట్స్, ర్యాంపులు, విద్యుత్, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలను పరిశీలించాలన్నారు. ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే తక్షణమే సౌకర్యాలను అందుబాటులోకి తేవాలన్నారు. ఎన్నికల రోజు సిబ్బంది పోలింగ్ కేంద్రాల్లో బస చేయడానికి ఏర్పాట్లను చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డీఎస్ వెంకన్న, ఆర్డీఓ కె.సత్యపాల్‌రెడ్డి, డీఆర్‌డీఓ నాగ పద్మజ, సీఈఓ ప్రసూనరాణి, డీపీఓ వెంకయ్య, కలెక్టరేట్ ఏఓ ప్రసాద్, ములుగు తహసీల్దార్ విజయ భాస్కర్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం తహసీల్దార్ సంధ్యారాణి, ఏపీడీ, ఎంపీడీఓలు, ఎన్నికల సిబ్బంది విజయ కుమార్, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

అనుమతి పొందితేనే ప్రచార సామగ్రి ముద్రించాలి

అనుమతి పొందితేనే ఎన్నికల ప్రచార సామగ్రిని ముద్రించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీఓ అంకిత్ తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ వెంకన్నతో కలిసి ఎన్నికల ప్రక్రియలో భాగంగా ప్రచారం కోసం ముద్రించే కరపత్రాలు, పోస్టర్లు తదితర అంశాల్లో తీసుకోవాల్సిన అనుమతులపై ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ప్రింటింగ్ చేయించే సామగ్రి, ఫ్లెక్సీలు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ నేతృత్వంలోని మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ ద్వారా ముందస్తు అనుమతి పొందాలన్నారు. ప్రచురించే అభ్యర్థి పేరు, చిరునామా వివరాలు తప్పనిసరిగా ముద్రించాలన్నారు. మ్యాటర్‌ను సైతం నిర్ణీత ప్రొఫార్మాలో సమర్పించాలన్నారు. వాటిని ఎంసీఎంసీ కమిటీ పరిశీలించి 24గంటల్లోగా అనుమతించడం లేదా తిరస్కరించడం జరుగుతుందన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన వారిపై ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 127-ఏ ప్రకారం చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ సమావేశంలో ములుగు తహసీల్దార్ విజయ భాస్కర్, జిల్లాలోని ప్రింటింగ్ ప్రెస్, ఫ్లెక్సీ దుకాణాల యజమానులు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

న్యూస్‌రీల్

భక్తిశ్రద్ధలతో పూజలు



ఏటూరునాగారం: మండల కేంద్రంలో శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా స్టార్ యూత్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత బుధవారం మహా లక్ష్మి దేవి అవతారంలో భక్తుల దర్శనమిచ్చినట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఎర్లప్రగడ రాధాకృష్ణశర్మ తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారిని రూ.5.50 లక్షల నగదుతో ప్రత్యేకంగా అలంకరించినట్లు తెలిపారు. అనంతరం నిర్వహించిన కుంకుమార్చనలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నట్లు వివరించారు. ఈ సందర్భంగా భవాని మాల ధరించిన స్వాములకు అన్నదానం కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు నూక ప్రభాకర్, వెలకుర్తి లక్ష్మణచారి, ముక్కెర భిక్షపతి, భరత్‌రెడ్డి, పర్వతాల ప్రసాద్, లాలయ్య, మడిగల నరేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే రామాలయంలో అమ్మవారు శ్రీమాతా అన్నపూర్ణదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. ముత్యాలమ్మ వద్ద లలితాదేవిగా అమ్మవారు భక్తుల పూజలు అందుకున్నారు.

ధాన్యం సేకరణపై జాగ్రత్తలు తప్పనిసరి



ములుగు రూరల్: వర్షాకాలం ధాన్యం సేకరణపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అన్నారు. జిల్లా కేంద్రంలో పౌర సరఫరాల అధికారులు, సివిల్ సప్లై కార్పొరేషన్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, జిల్లా సహకార శాఖ అధికారులు, డీఆర్‌డీఓ మార్కెటింగ్ శాఖ, డీఎం గిరిజన కార్పొరేషన్ రైస్ మిల్లర్లు, ట్రాన్స్ పోర్టు కాంట్రాక్టర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ధాన్యం కొనుగోళ్లపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు ఇచ్చారు. అనంతరం సివిల్ సప్లై గోదాముల్లో పనిచేస్తున్న 44 మంది హమాలీలకు దసరా సందర్భంగా దుస్తులు బోనస్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లై మేనేజర్ రాములు తదితరులు ఉన్నారు.

రైతులకు అందుబాటులో ఆయిల్‌పామ్ మొక్కలు



ములుగు రూరల్: మండల పరిధిలోని ఇంచర్లలో ఏర్పాటు చేసిన ఆయిల్‌పామ్ నర్సరీలో మొక్కలు అందుబాటులో ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి గౌస్ హైదర్ అన్నారు. ఇంచర్లలోని ఆయిల్ పామ్ నర్సరీని ఆయన బుధవారం సందర్శించి మాట్లాడారు. ఈ సంవత్సరం జిల్లాలో 4,300 ఎకరాల ఆయిల్ పామ్ సాగు టార్గెట్‌గా ఉందన్నారు. ఇప్పటి వరకు 2,400 ఎకరాల్లో సాగు చేసుకునేందుకు రైతులు మొక్కల కోసం పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. ఆసక్తిగల రైతులు వ్యవసాయ విస్తీర్ణ అధికారి, మండల వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. అనంతరం రైతులకు ఆయిల్ పామ్ మొక్కలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారులు కల్యాణి, వేణుమాధవ్, మైక్రో ఇరిగేషన్ ఇంజనీర్ వినోద్, ఆయిల్ పామ్ కంపెనీ, కెన్ బయో సైన్స్ ప్రతినిధులు హేమంత్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అటు.. ఇటు

- నియోజకవర్గాల పునర్విభజనతో మారిన జనగామ స్వరూపం

ప్రలోభాలకు చెక్

- సీ విజిల్ యాప్‌తో అక్రమాలకు అడ్డుకట్ట

ఆధారం లేకుండా తరలింపు.. నగదు స్వాధీనం

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీలు
- భారీగా నగదు స్వాధీనం

- IIలో ▸

ప్రజాస్వామిక సంస్కారం బయట నుంచి వచ్చేది కాదు. మనిషి లోపలి నుంచి ప్రభవించేది.
- మహాత్మాగాంధీ



ఈ ముచ్చటెరుకేనా?

ఓటుహక్కు ఎలా వచ్చిందో తెలుసా?

హన్మకొండ అర్బన్: దేశంలో 1950 నుంచి సార్వత్రిక వయోజన ఓటుహక్కు అమల్లోకి వచ్చింది. రాజ్యాంగంలోని 326వ అధికరణం ద్వారా సార్వత్రిక ఓటుహక్కు కల్పించారు. ఇది ప్రపంచ రాజకీయ చరిత్రలో ఒక విప్లవాత్మక చర్య. ఎందుకంటే సార్వత్రిక ఓటుహక్కు ఎన్నో దేశాల్లో అమలు కావడానికి వందల సంవత్సరాలు పట్టింది. భారతదేశంలో సార్వత్రిక ఓటుహక్కు అమల్లోకి వచ్చేనాటికి గ్రీస్, ఆస్ట్రేలియా, స్విట్జర్లాండ్, దక్షిణాఫ్రికా వంటి దేశాల్లో కొన్ని వర్గాల వారికి ఓటు హక్కు అందలేదు. ఇదీ భారత రాజ్యాంగం చూపిన రాజకీయ పరిణతి.



మంత్రికి ఓటర్ స్లిప్ అందజేత




పర్వతగిరి: వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రంలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు తన నివాసంలో స్థానిక బూత్ లెవల్ ఆఫీసర్ మేడిశెట్టి కరుణాకర్ కొత్త ఎపిక్ నంబర్‌తో ఉన్న ఓటర్ స్లిప్ అందజేశారు. గతంలో 14 నంబర్లు ఉన్న ఎపిక్‌ను ఎన్నికల సంఘం ప్రస్తుతం పది నంబర్లుగా మార్చడంతో మంత్రి ఎర్రబెల్లికి కొత్త ఓటర్ స్లిప్ అందజేశారు.

జంగ్ తెలంగాణ

1,400 మంది ఓటర్లే ఎందుకంటే..

జనగామ: ఎన్నికల ప్రక్రియలో చాలా విషయాలు తెలుసుకోవాలి. బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్ ఇలా ఒకదానికొకటి అనుసంధానంగా పనిచేస్తాయి. ఇందులో ఈవీఎం పాత్ర ప్రధానం. ప్రతీ పోలింగ్ కేంద్రంలో గరిష్ఠంగా 1,400 మంది ఓటర్లు మాత్రమే ఉంటారు. ఆ సంఖ్యను ఎందుకు పరిమితం చేస్తారంటే.. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియలో వినియోగిస్తున్న ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్)లకు అనుసంధానించి ఉండే వీవీ ప్యాట్ (ఓటర్ వెరిఫైలబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్)లో థర్మల్ కాగితం పొందుపరుస్తున్నారు. ఈ కాగితం 1,500 స్లిప్పులను మాత్రమే ముద్రించగలుగుతుంది. 22.5 ఓల్ట్స్ బ్యాటరీతో పని చేసే వీవీప్యాట్‌లో ఓటరు ఎవరికి ఓటు వేసిందనేది డిస్‌ప్లేలో కనిపిస్తుంది. అయితే ఇందులో వంద వరకు కాగితపు స్లిప్పులు పోలింగ్ రోజున మాక్ పోలింగ్ ప్రక్రియలోనే ఖర్చవుతాయి. అందుకే గరిష్ఠంగా ప్రతీ పోలింగ్ స్టేషన్‌లో 1,400 మంది ఓటర్లు మాత్రమే ఉండేలా అధికారులు ఏర్పాట్లు చేశారు.



ప్రలోభాలకు చెక్..

- సీ విజిల్ యాప్‌తో అక్రమాలకు అడ్డుకట్ట
- పోలీసు కంట్రోల్ రూంకు సైతం అనుసంధానం
- 100 నిమిషాల్లో బాధ్యులపై చర్యలు

సీ విజిల్ యాప్ ద్వారా నేరుగా ఫిర్యాదు చేయండి



ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై సీ విజిల్ యాప్ ద్వారా ప్రజలు నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. యాప్ ద్వారా ఫిర్యాదు అందిన వెంటనే అధికారులు ఘటనాస్థలికి చేరుకొని 100 నిమిషాల్లోపు బాధ్యులపై చర్యలు తీసుకుంటారు. సీ విజిల్ యాప్ వినియోగంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై సీ విజిల్ యాప్‌తో పాటు 1950 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా కూడా ప్రజలు ఫిర్యాదు చేయవచ్చు.

-ఇలా త్రిపాఠి, జిల్లా ఎన్నికల అధికారి

వెంకటాపురం(ఎం): శాసనసభ ఎన్నికల్లో అవినీతి, అక్రమాలకు చెక్ పెట్టేందుకు ఎన్నికల సంఘం సీ విజిల్ యాప్‌ను రూపొందించింది. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు ఓటర్లకు డబ్బు, మద్యం, ఇతర వస్తువులను ఎరగా చూపి అడ్డదారిలో గెలుపొందేందుకు ప్రయత్నాలు చేస్తుంటారు. ఇలాంటి వాటికి చెక్ పెట్టేందుకు ఎన్నికల సంఘం రూపొందించిన సీ విజిల్ యాప్ ప్రజలకు బ్రహ్మాస్త్రంగా మారనుంది. ప్రజలు, ఓటర్లు ఈ యాప్ ద్వారా అధికారులకు ఫిర్యాదు చేయాలని, ఫిర్యాదు అందిన 100 నిమిషాల్లోనే అక్రమాలకు పాల్పడుతున్న బాధ్యులపై చర్యలు తీసుకోనున్నారు.

డౌన్‌లోడ్ ఇలా..

ఆండ్రాయిడ్ ఫోన్ ఉన్న ప్రతిఒక్కరూ ప్లేస్టోర్ నుంచి సీ–విజిల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. డౌన్‌లోడ్ అయిన తర్వాత ఫోన్ నంబర్ నమోదు చేస్తే ఓటీపీ వస్తుంది. ఓటీపీ నమోదు చేయగానే ఫొటో, వీడియో, ఆడియో లాంటి మూడు రకాల ఆప్షన్లు కనిపిస్తాయి. లైవ్ లొకేషన్ ఆన్ చేసి అక్కడ జరుగుతున్న అక్రమాలను బట్టి ఆడియో, వీడియో, ఫొటోలు ఏదో ఒక దానిని ఎంపిక చేసి ప్రొసీడ్ కొడితే నేరుగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌కి చేరుతాయి. ఫిర్యాదుదారులు ఏ లొకేషన్ నుంచి వాటిని పంపారనేది అధికారులకు స్పష్టంగా తెలుస్తుంది. వెంటనే అధికారులు ఘటనాస్థలికి చేరుకొని విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటారు.

పోలీస్ కంట్రోల్ రూంకు..

సీ–విజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులు ఎన్నికల అధికారులతో పాటు నేరుగా పోలీస్ కంట్రోల్ రూంకు కూడా అందుతాయి. ఫ్లయింగ్ స్క్వాడ్, సర్వేలెన్సు బృందాలు, రిజర్వ్ టీములు అప్రమత్తమై వెంటనే లొకేషన్‌కు వెళ్లి బాధ్యులపై చర్యలు తీసుకునే విధంగా యాప్‌ను అనుసంధానం చేశారు. సీ విజిల్ యాప్‌ను తప్పుదోవ పట్టించే వీలు లేకుండా లైవ్ లొకేషన్ ఉపయోగిస్తేనే యాప్‌లో ఫిర్యాదు నమోదు అవుతుంది. పాత ఫొటోలు, వీడియోలు అప్‌లోడ్ చేయకుండా యాప్‌ను రూపొందించారు. పాత ఫొటోలతో ఎదుటి వారిపై ఫిర్యాదు చేసినా యాప్ తీసుకోదు.

అటు..ఇటు..

నియోజకవర్గాల పునర్విభజనతో మారిన జనగామ స్వరూపం..

- కనుమరుగైన చేర్యాల కానిస్టెన్సీ
- సిద్దిపేట జిల్లాలో నియోజకవర్గ మండలాలు
- 15 సార్లు ఎన్నికలు..నాలుగు దఫాలు గెలిచిన పొన్నాల, నిమ్మ రాజిరెడ్డి



జనగామ : పోరాటాల ఖిల్లా.. ఆత్మగౌరవ బావుట.. పౌరుషానికి ప్రతీక.. ధీరత్వం కలిగిన ప్రాంతం జనగామ. ఇక్కడి ప్రజలు నిత్య చైతన్య వంతులు. ఏ ఘటన జరిగినా వెంటనే స్పందిస్తారు. పాలకుల తప్పులు ఎప్పటికప్పుడు ఎత్తి చూపుతారు. ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా పాలించే నాయకులను కంటికి రెప్పలా కాపాడుకుంటారు. అందుకే అందుకే జనగామకు రాష్ట్రంలో ప్రత్యేకత గుర్తింపు ఉంది. దీంతో ఈ నియోజవర్గంపై పట్టు సాధించేందుకు ఆయా పార్టీలు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తాయి. ఈ నేపథ్యంలో జనగామ నియోజకవర్గం ఎప్పుడు ఏర్పడింది? ఈ నియోజవకవర్గంపై ఇప్పటి వరకూ ఎక్కువ కాలం పాలించిన పార్టీలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

కాంగి'రేస్' విజయం ..

జనగామ నియోజకవర్గంపై కాంగ్రెస్ పార్టీ అత్యధిక విజయాలు తన ఖాతాలో వేసుకుంది. 1952లో నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు 15 దఫాలుగా ఎన్నికలు జరిగాయి. ఇందులో తొమ్మిది దఫాలు కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. సీపీఎం పది సంవత్సరాలు, పీడీఎఫ్, టీడీపీ, సీపీఐ చెరో ఐదేళ్లు, బీఆర్ఎస్ వరుసగా రెండు పర్యాయాలు గెలుపొందింది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు 45 సంవత్సరాలు అధికారంలో ఉంటే, అందులో పొన్నాల లక్ష్మయ్య రెండు దశాబ్దాలు జనగామను పాలించారు. పదిహేనేళ్ల పాటు సహాయ, కేబినెట్ మంత్రి పదవులు చేపట్టారు.

మార్పులు.. చేర్పులు

జనగామ నియోజకవర్గంలో జనగామ మండలం మినహాయించి మిగతా మండలాలన్నీ కొత్తవే. 2009 ఎన్నికల సమయంలో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనతో జనగామ స్వరూపం పూర్తిగా మారింది. చేర్యాల నియోజకవర్గం కనుమరుగుకావడంతో అందులోని చేర్యాల, మద్దూరు, నర్మెట, బచ్చన్నపేట మండలాలు జనగామలో విలీనం చేశారు. అంతకు ముందు జనగామలో ఉన్న రఘునాథపల్లి, లింగాలఘణపురం మండలాలు స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో కలవగా, దేవరుప్పుల మండలం పాలకుర్తిలో కలిసింది. ఈ నేపథ్యంలో జనగామ నియోజకవర్గానికి కొత్త స్వరూపం సంతరించుకుంది. దీంతో మారిన స్వరూపంతో పొన్నాల స్థానికేతర నియోజకవర్గం నుంచి బరిలో దిగాల్సి వచ్చింది. ఎందుకంటే పొన్నాల సొంత గ్రామం రఘునాథపల్లి మండలం ఖిలాషాపురం. ఇది స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఉంది.

'పొన్నాల'దే పై'చేయి'..

1989లో పొన్నాల లక్ష్మయ్య మొదటిసారి జనగామ ఎమ్మెల్యేగా విజయం సాధించి, అప్పటి సీఎం నేదుమల్లి జనార్దన్‌రెడ్డి కేబినెట్‌లో మంత్రిగా బాధ్యలు చేపట్టారు. అలాగే, 1999, 2004, 2009 ఎన్నికల్లో గెలుపొందారు. నాటి ముఖ్యమంత్రులు వైఎస్సార్, రోశయ్య, కిరణ్ కుమార్‌రెడ్డి హయాంలో పదేళ్లు మంత్రి పదవిలో కొనసాగారు. ఇక్కడ నుంచి ఎన్నికైన వారిలో అత్యధిక కాలం మంత్రి పదవి చేపట్టిన ఘనత కూడా ఈయనకే దక్కింది. నియోజకవర్గ చరిత్రలో అత్యధిక కాలం ఎమ్మెల్యేగా పనిచేసిన రికార్డు ఉన్న పొన్నాల.. 2014, 2018లో జరిగిన ఎన్నికల్లో వరుసగా రెండు దఫాలు ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డిపై ఓడిపోయారు.

జనగామ, చేర్యాల నియోజకవర్గాల నుంచి పోటీ చేసి గెలుపొందిన ఎమ్మెల్యేలు



లింగయ్య (కాంగ్రెస్), గౌరై సిద్ధయ్య (కాంగ్రెస్), కమాలొద్దీన్ (కాంగ్రెస్), రాజలింగం (కాంగ్రెస్), పి.లక్ష్మయ్య (కాంగ్రెస్), ప్రతాప్‌రెడ్డి (బీఆర్ఎస్), ముత్తిరెడ్డి (బీఆర్ఎస్), గోపాల్‌రెడ్డి (పీడీఎఫ్), ఏసిరెడ్డి నర్సింహారెడ్డి, రాజారెడ్డి (సీపీఎం)

ఇప్పటివరకు గెలిచిన ఎమ్మెల్యేలు వీరే...

సంవత్సరం	గెలిచిన వారు	పార్టీ	సమీప ప్రత్యర్థి	పార్టీ
1952	సయిద్ ఏ హుస్సేన్	పీడీఎఫ్	మహ్మద్ అబిద్	కాంగ్రెస్
1957 (ద్వి)	గోక రామలింగం	కాంగ్రెస్	కె. రాఘవులు	పీడీఎఫ్
	జి.గోపాల రెడ్డి	పీడీఎఫ్	జె.రెడ్డి	కాంగ్రెస్
1962	గోక రామలింగం	కాంగ్రెస్	కె. రాఘవులు	సీపీఐ
1962–67	రాఘవులు	సీపీఐ	కోర్టు తీర్పు ద్వారా ఎన్నిక	
1967	ఎండీ కమాలుద్దీన్	కాంగ్రెస్	నర్సింహారెడ్డి	సీపీఎం
1972	కె. నారాయణ	కాంగ్రెస్	డీఎస్ఆర్ రెడ్డి	ఇండిపెండెంట్
1978	కె. వరదారెడ్డి	కాంగ్రెస్(ఐ)	ఎ. నర్సింహారెడ్డి	సీపీఎం
1983	ఆర్.లక్ష్మారెడ్డి	టీడీపీ	కె. వరదారెడ్డి	కాంగ్రెస్
1985	అసిరెడ్డి నర్సింహారెడ్డి	సీపీఎం	పొన్నాల లక్ష్మయ్య	కాంగ్రెస్
1989	పొన్నాల లక్ష్మయ్య	కాంగ్రెస్	చరగొండి రాజారెడ్డి	సీపీఎం
1994	చరగొండి రాజారెడ్డి	సీపీఎం	పొన్నాల లక్ష్మయ్య	కాంగ్రెస్
1999	పొన్నాల లక్ష్మయ్య	కాంగ్రెస్	జి. ప్రేమలతారెడ్డి	టీడీపీ
2004	పొన్నాల లక్ష్మయ్య	కాంగ్రెస్	బస్వారెడ్డి	టీడీపీ
2009	పొన్నాల లక్ష్మయ్య	కాంగ్రెస్	కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి	టీఆర్ఎస్
2014	ముత్తిరెడ్డి యాదగిరి రెడి	టీఆర్ఎస్	పొన్నాల లక్ష్మయ్య	కాంగ్రెస్
2018	ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి	టీఆర్ఎస్	పొన్నాల లక్ష్మయ్య	కాంగ్రెస్

కమాలుద్దీన్‌కు కలిసొచ్చింది..

జనగామ నియోజకవర్గం నుంచి 1967లో ఎమ్మెల్యేగా గెలుపొందిన ఎండీ కమాలుద్దీన్ అహ్మద్ రాజకీయ జీవితం ఓ మైలురాయి. రాష్ట్ర, కేంద్ర మంత్రి పదవులతో పాటు చేర్యాల ఎమ్మెల్యే, పీసీసీ అధ్యక్షుడిగా పని చేసిన అతను.. సౌదీఅరేబియాలో భారత రాయబారిగా పని చేశారు. అంతకు ముందు వరంగల్, హనుమకొండ నుంచి మూడు దఫాలు లోక్‌సభకు ఎన్నికయ్యారు.

సంతోషం.. స్వల్పం

1962లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన గోక రామలింగం 14 ఓట్ల అత్యల్ప మెజారిటీతో తన సమీప ప్రత్యర్థి సీపీఐకి చెందిన కె.రాఘవులుపై గెలుపొందారు. 2009లో ఎన్నికల్లో తన సమీప బీఆర్ఎస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిపై కాంగ్రెస్ నుంచి బరిలో నిలిచిన పొన్నాల కేవలం 236 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో 2,09,382 ఓట్లు నమోదుకాగా, 1,51,269 ఓట్లు పోలయ్యాయి. వీటిలో పొన్నాలకు 61,218 ఓట్లు రాగా.. కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి 60,982 ఓట్లు వచ్చాయి. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి 32 వేలపై చిలుకు ఓట్ల మెజార్టీతో గెలిచారు. ఇండిపెండెంట్ అభ్యర్థులు ఎక్కువ శాతం కాంగ్రెస్ ఓట్లకు గండికొట్టారు.

ద్విసభ అవకాశం..

1957లో జనగామ నియోజకవర్గం ద్విసభ స్థానంగా ఉంది. దీంతో ఆ సమయంలో పీడీఎఫ్‌కు చెందిన జి.గోపాల్ రెడ్డి, కాంగ్రెస్‌కు చెందిన గోక రామలింగం ఎమ్మెల్యేలుగా పని చేశారు.

సీటు.. ఫట్.

1962లో గోక రామలింగం ఎన్నికపై ప్రత్యర్థి సీపీఐ అభ్యర్థి రాఘవులు కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా , వాదనలు విన్న అనంతరం కోర్టు రామలింగం ఎన్నికను కొట్టివేసింది. రాఘవులు ఎన్నికైనట్లు తీర్పు వెలువరించింది.

చేర్యాలదీ ప్రత్యేకమే..

జనగామ నియోజకవర్గంలో కలిసి కనుమరుగైన చేర్యాలదీ ప్రత్యేకస్థానమే. 1962లో ఏర్పడిన ఈ నియోజకవర్గం 2009 ఎన్నికల్లో రద్దయింది. ఈ కాలంలో 11 సార్లు ఎన్నికలు జరగగా చెరో నాలుగుసార్లు టీడీపీ, కాంగ్రెస్, ఒకసారి సీపీఐ, రెండు సార్లు బీఆర్ఎస్ గెలిచాయి. 1962లో కాంగ్రెస్‌కు చెందిన కమాలుద్దీన్, 1967లో సీపీఐకి చెందిన అబ్రహం ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1972, 1978లో కాంగ్రెస్‌కు చెందిన పి.కాటం లింగయ్య, గౌరై సిద్ధయ్య ఎన్నికయ్యారు. 1983, 1985, 1989, 1994లో టీడీపీకి చెందిన నిమ్మ రాజిరెడ్డి వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది రికార్డు సృష్టించారు. అంతే కాకుండా ఈయన 1989లోఎన్టీఆర్ కేబినెట్‌లో మంత్రిగా కూడా పని చేశారు. అనంతరం 1999లో కాంగ్రెస్‌కు చెందిన నాగపురి రాజలింగం, 2004 రెగ్యులర్, 2008 ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు చెందిన కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2009లో ఏర్పాటైన జనగామ నియోజకవర్గంలో పొన్నాల లక్ష్మయ్య.. ముత్తిరెడ్డిపై విజయం సాధించిన విషయం తెలిసిందే. 2023లో జరిగే సాధారణ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరుపున పల్లా రాజేశ్వర్‌రెడ్డి బరిలో నిలువగా, కాంగ్రెస్, బీజేపీ నుంచి టికెట్లు ఇంకా ఖరారు కాలేదు.

ఆధారం లేకుండా తరలింపు.. నగదు స్వాధీనం

ఎన్నికల కోడ్ నేపథ్యంలో రాష్ట్రంలో పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు చేపడుతున్నారు. అణువణువు సోదా చేస్తూ అనుమానితులను ప్రశ్నిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా వివిధ వాహనానుల క్షుణ్ణంగా పరిశీలించారు. బస్సుల నుంచి.. బైక్‌ల వరకు జల్లెడ పట్టారు. ఇందులో ఆధారం లేకుండా తరలిస్తున్న నగదు, బంగారం ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

కాళోజీ జంక్షన్‌లో రూ.9 లక్షలు..

వరంగల్ క్రైం: హనుమకొండ బ్రాహ్మణవాడకు చెందిన డోలి కోటేశ్వర్ ద్విచక్ర వాహంనంపై తరలిస్తున్న రూ.9 లక్షల నగదును కాళోజీ జంక్షన్ వద్ద బుధవారం స్వాధీనం చేసుకున్నామని సుబేదారి సీఐ షూకుర్ తెలిపారు. నగదుకు ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

ఎర్రగట్టు క్రాస్ వద్ద రూ.8.21లక్షలు..

హసన్‌పర్తి: ఎర్రగట్టు క్రాస్ నుంచి అంబాల వరకు పోలీసులు బుధవారం వాహన తనిఖీలు నిర్వహించారు. హసన్‌పర్తి, కమలాపూర్,ఎల్కతుర్తి పోలీసులు ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో రూ.8.21లక్షలు పట్టుబడ్డాయి. ఈ డబ్బును సీజ్‌చేసినట్లు హసన్‌పర్తి సీఐ గోపీ తెలిపారు.కాగా, హసన్‌పర్తి మండలం కొత్తపల్లి సర్పంచ్ శ్రీలత ఇంటిలో పోలీసులు తనిఖీలు చేపట్టి 23 బతుకమ్మ చీరలు స్వాధీనం చేసుకున్నారు.

మానుకోటలో రూ. 3.7లక్షలు..

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ టౌన్ పోలీసులు జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్ ప్రాంతంలో ఒక వ్యక్తి వద్ద రూ. 3.7లక్షల నగదు, మరో వ్యక్తి వద్ద 2.750 కిలోల వెండి లభ్యంకాగా వాటిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నగదు, వెండికి సంబంధించిన వ్యక్తులు ఆధారాలు సమర్పించడంతో తిరిగి అప్పగించారు. తనిఖీల్లో టౌన్ సీఐ వై.సతీష్, ఎస్సైలు వి.విజయ్‌రాంకుమార్, వి.దీపికారెడ్డి, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ బాధ్యుడు ఐ.సామ్రాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

నగర పరిధిలో రూ.3 లక్షలకు పైగా..

రామన్నపేట : నగర పరిధిలో మట్టెవాడ పోలీసులు చేపట్టిన తనిఖీల్లో సుబేదారికి చెందిన సయ్యద్ ఖాజా లతీఫుద్దీన్ వద్ద నుంచి రూ. 74 వేలు, ఎల్బీనగర్‌కు చెందిన శివప్రసాద్ వద్ద నుంచి రూ.1,17,450, హైదరాబాద్‌కు చెందిన ముస్తాఫా నుంచి రూ.1,24,000 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు.

నర్మెటలో రూ. 2.20 లక్షలు..

నర్మెట: మండల కేంద్రంలో చేపట్టిన వాహన తనిఖీల్లో భాగంగా ఆధారం లేకుండా తరలిస్తున్న నగదును సీజ్ చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. తనిఖీల్లో ముగ్గురి నుంచి రూ. 90 వేలు, రూ.1.90 లక్షలు, రూ.2.20 లక్షలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇందులో ఇద్దరు వ్యక్తులు ఆధారాలు చూపగా వారికి నగదు అప్పగించామన్నారు. భీమదేవరపల్లి మండలం కొత్తపల్లికి చెందిన కొంగల ఆదిరెడ్డి ఆధారాలు చూపకపోవడంతో రూ. 2.20 లక్షలు సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.



హసన్‌పర్తి: తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

చిన్నపెండ్యాలలో రూ. రెండు లక్షలు..

చిల్పూరు: మండలంలోని చిన్నపెండ్యాల గ్రామంలో బుధవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ. రెండు లక్షలు లభ్యమయ్యాయని ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన మద్ది రాజు ద్విచక్రవాహనంలో ఆధారం లేకుండా రూ. రెండు లక్షలు తరలిస్తుండగా సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

హనుమకొండ పీఎస్ పరిధిలో 1.50 లక్షలు..

వరంగల్ క్రైం: హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో హన్‌మాన్ జంక్షన్‌లో బుధవారం వాహన తనిఖీలు చేపట్టినట్లు సీఐ కరుణాకర్ తెలిపారు. గుంట వెంకటరమణ అనే వ్యక్తి కారులో ఆధారం లేకుండా తరలిస్తున్న రూ. 1.50 లక్షలు సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

వెంకట్రామ జంక్షన్‌లో రూ.లక్ష ..

కాశిబుగ్గ: వరంగల్ ఏసీపీ బోనాల కిషన్ ఆధ్వర్యంలో వెంకట్రామ జంక్షన్‌లో పోలీసులు బుధవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏనుమాముల ప్రాంతానికి చెందిన చంద్రగిరి శ్రీనివాస్.. ఆధారం లేకుండా బైక్‌పై తరలిస్తున్న రూ.లక్ష నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఇంతేజార్‌గంజ్ సీఐ ముస్కె శ్రీనివాస్ తెలిపారు.

పరకాల మండలంలో..

పరకాల: మండలంలోని వెల్లంపల్లి క్రాస్ వద్ద పరకాలకు చెందిన గోరంటల రామకృష్ణ వద్ద రూ.2లక్షల నగదు, అదే విధంగా రేగొండ మండల గూడెపల్లికి చెందిన సిరికొండ రవీందర్‌రావు కారులో రూ.12 లక్షల10 వేల విలువైన 22 తులాల బంగారు ఆభరణాలు పట్టుబడ్డాయి.

వాటర్ బాటిళ్లు, టిఫిన్ బాక్స్‌ల పట్టివేత



వర్ధన్నపేట: మండలంలోని చెన్నారం గ్రామంలో ఉప సర్పంచ్ రాజమౌళి గౌడ్ ఇంట్లో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లకు పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉంచిన 25 టిఫిన్ బాక్స్‌లు, 39 వాటర్ బాటిళ్లు, 15 బ్యాగ్‌లను టాస్క్‌ఫోర్స్ సీఐ బాబులాల్, ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు బుధవారం పట్టుకున్నారు. అనంతరం వాటిని మామునూరు పోలీసులకు అప్పగించి రాజమౌళిపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

ఎవరెవరు ఏమన్నారంటే..



మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి



మాట్లాడుతున్న సీతక్క, భట్టి విక్రమార్క

ములుగు/ ములుగు రూరల్/వెంకటాపూర్(ఎం): ఆదివాసీ గిరిజన ప్రాంతం ములుగు జిల్లా వెంకటాపూర్(ఎం) మండలం రామాంజాపూర్‌లో బుధవారం జరిగిన కాంగ్రెస్ విజయభేరి సభలో ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్, ప్రియాంకాగాంధీలు పాల్గొన్నారు. వీరి ప్రసంగానికి ముందు పలువురు రాష్ట్ర, జిల్లా నాయకులు మాట్లాడారు.

చివరి శ్వాసవరకు ప్రజల్లోనే ఉంటా..

నా గొంతులో చివరి శ్వాస వరకు ప్రజల కోసం ప్రజల మధ్యనే ఉంటా. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను కాపీ కొట్టి బీఆర్ఎస్ నేతలు పథకాల్లో ఉన్న రేట్లను పెంచుతున్నారు. మేము ప్రశ్నించే గొంతుకగా ఉంటాం కాబట్టే కేబినెట్‌లో ఉండకూడదని కేసీఆర్ చూస్తున్నారు. ప్రసార మాధ్యమాలలో నాపై అసత్య ప్రచారం చేస్తున్నారు. గాంధీ కుటుంబానిది మాట తప్పని వంశం. ఇందిరమ్మ రాజ్యం మళ్లీ వస్తుంది. నియోజకవర్గ ప్రజలు గెలిపించి నన్ను ఆశీర్వదించాలి.

– ములుగు ఎమ్మెల్యే సీతక్క

ఇద్దరిని 50 వేల మెజారిటీతో గెలిపించాలి..

ములుగు ఎమ్మెల్యే సీతక్క, భూపాలపల్లి కాంగ్రెస్ అభ్యర్థి గండ్ర సత్యనారాయణలను 50 వేల మెజారిటీతో గెలిపించాలి. తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకు తల్లి సోనియా రాష్ట్రాన్ని ఇస్తే కల్వకుంట్ల కుటుంబం దోచుకుని తింటుంది. ఆదివాసీ గిరిజన రైతులకు పోడు పట్టాలను ముఖ్యమంత్రి కేసీఆర్ ఇవ్వలేదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే అసైన్డ్, పోడు భూములకు పట్టాలందిస్తాం. సీఎం కేసీఆర్ పదేళ్ల పాలనలో 10వేల ఎకరాల భూములను అక్రమించుకొని, లక్షల కోట్ల ఆస్తులు సంపాదించుకున్నాడు.

– టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంపద..

సోనియమ్మ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాల ద్వారా ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంపద అందిస్తాం. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమల్లోకి తీసుకవచ్చిన ఫారెస్ట్ యాక్ట్‌ను బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. అధికారంలోకి రాగానే అర్హులైన అందరికి న్యాయం జరిగేలా చూస్తాం.

–శాసనసభా పక్ష నేత భట్టి విక్రమార్క

ఫలితాల్లో బలం చూపిద్దాం..

నవంబర్ 30న జరగనున్న ప్రజాసంగ్రామంలో కేసీఆర్ ప్రభుత్వంపై కదం తొక్కాలి. ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ విజయభేరి మోగించేలా కార్యకర్తలు, ప్రజలు కాంగ్రెస్‌కు అధికసంఖ్యలో ఓటేసి గెలిపించాలి. రాష్ట్రంలో కుటుంబపాలనకు చరమగీతం పాడి అభివృద్ధి చేసే హస్తం పార్టీకి పట్టం కట్టాలి.

– గండ్ర సత్యనారాయణరావు, భూపాలపల్లి కాంగ్రెస్ అభ్యర్థి



రాహుల్, ప్రియాంక గాంధీకి జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే సీతక్క



సభావేదికపై ముచ్చటిస్తున్న రాహుల్, ప్రియాంక గాంధీ

డీఎస్పీ అభ్యర్థిని గెలిపించాలి

- పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు విశారదన్ మహారాజ్


మాట్లాడుతున్న విశారదన్ మహారాజ్

పరకాల : అణగారిన వర్గాలకు చెందిన డీఎస్పీ అభ్యర్థి గెలుపుతోనే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు న్యాయం జరుగుతుందని ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ)వ్యవస్థాపక అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో బుధవారం రాత్రి పరకాలలో పార్టీ అభ్యర్థి పూరేళ్ల రమేష్ తరపున ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో 119 నియోజకవర్గాలలో డీఎస్పీ అభ్యర్థులు బరిలో ఉంటారన్నారు. కచ్చితంగా రాజ్యాధికారమే లక్ష్యంగా డీఎస్పీ ముందుకెళ్తుందన్నారు.

డీఎస్పీ నాయకులపై కేసు నమోదు..

పరకాల బస్టాండ్ కూడలిలో రాత్రి 10 గంటల దాటిన కూడా డీఎస్పీ నాయకులు సమావేశం నిర్వహించి ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సీపీ టీం ఇన్‌చార్జి శేషాంజన్‌స్వామి ఫిర్యాదు మేరకు డీఎస్పీ పట్టణ సెక్రటరీ బొచ్చు శ్రీకృష్ణ మహారాజ్‌పై కేసు నమోదు చేశారు.

బాల్‌బ్యాడ్మింటన్‌లో ఎన్పీడీసీఎల్ విజయం


ట్రోఫీ అందుకుంటున్న ఎన్పీడీసీఎల్ బ్యాడ్మింటన్ జట్టు

హన్మకొండ: తెలంగాణ ట్రాన్స్‌కో డిస్కంల రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో ఎన్పీడీసీఎల్ వరంగల్ జట్టు విజేతగా నిలిచింది. ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు హైదరాబాద్ సనత్‌నగర్‌లోని జీహెచ్ఎంసీ గ్రౌండ్‌లో బాల్‌బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహించారు. చివరి రోజు నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో టీఎస్ ఎన్పీడీసీఎల్ ఉమ్మడి వరంగల్, మహబూబ్‌నగర్ జట్లు తలపడగా.. వరంగల్ జట్టు ట్రోఫీని దక్కించుకుంది. విజయం సాధించిన క్రీడాకారులు ఎస్.చిట్టిరెడ్డి, పీవీ డేవిడ్, డి.సదయ్య, సీహెచ్.రాజేందర్, జి.కిరణ్, బి.బాబునాయక్, ఎం.సుఖేందర్‌ను ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు, ఎస్ఈ, డీఈలు అభినందించారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

- కొనసాగుతున్న శరన్నవరాత్రోత్సవాలు
- వేర్వేరు అలంకరణలో భక్తులకు దర్శనం

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయంలో దేవీశరన్నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం నాలుగోరోజు ఆలయ అర్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో అమ్మవారిని శ్రీమహాలక్ష్మీదేవిగా అలంకరించి కూష్మాండిని క్రమంలో పూజలు జరిపారు. అనంతరం అమ్మవారి ఉత్సవ మూర్తిని సూర్యప్రభ వాహనంపై ఊరేగించారు. సాయంత్రం అమ్మవారికి గిరిజా క్రమంలో పూజలు నిర్వహించి హంస వాహనంపై ఊరేగించారు. యాదగిరి గుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవాలయం చైర్మన్ భాస్కరాయని నరసింహమూర్తి కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ శేషుభారతి పర్యవేక్షించారు.

అమ్మవారికి స్వర్ణ కిరీటం అలంకరణ

హన్మకొండ కల్చరల్: బ్యాంకులో భద్రపర్చిన అమ్మవారి స్వర్ణ కిరీటం, జఠామకుటాలు, కర్ణపత్రాలు తదితర ఆభరణాలున్న బాక్సులను బుధవారం రాత్రి ఆలయ ఈఓ శేషుభారతి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తుతో దేవాలయానికి తరలించారు. శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా అమ్మవారికి అలంకరించేందుకు అర్చకులకు అందజేశారు. కార్యక్రమంలో దేవాలయ పర్యవేక్షకులు అద్దంకి విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


సూర్యప్రభ వాహనంపై అమ్మవారు


అర్చకులకు స్వర్ణ కిరీటాన్ని అందజేస్తున్న సిబ్బంది

కుష్మాండి అలంకరణలో పద్మాక్షమ్మ

హన్మకొండ అర్బన్: నగరంలోని హనుమద్గిరి పద్మాక్షి దేవాలయంలో అమ్మవారు కుష్మాండి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం ఆలయంలో చండీహోమం, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో అలయ ప్రధాన అర్చకులు నాగిళ్ల శంకర్ శర్మ, అర్చకులు నాగిళ్ల షణ్ముక ప ద్మనాభ అవధాని, పద్మాక్షి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు. కాగా.. అమ్మవారిని మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు దర్శించుకున్నారు.


కుష్మాండి అలంకరణలో పద్మాక్షి అమ్మవారు


కరెన్సీ దండలతో శ్రీమహాలక్ష్మీ దేవి

శ్రీమహాలక్ష్మిగా లలితాదేవి

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లోని శ్రీసీతా రామచంద్రస్వామి దేవాలయంలోని శ్రీలలితాదేవి అమ్మవారిని బుధవారం రూ. 2 లక్షల కరెన్సీ నోట్ల దండలతో శ్రీమహాలక్ష్మీ అమ్మవారిగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ పూజారి వేంకటేశ్వరచార్యుల ఆధ్వర్యంలో ఆలయ కమిటీ నేతృత్వంలో శ్రీలలితాదేవికి నోట్ల కట్టలు పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. కృష్ణమూర్తి, అశోక్, శ్రీరాంరాజేశ్, అడెపు శ్యామ్‌సుందర్, నవీన్, భక్తులు పాల్గొన్నారు.

ప్రజల ముఖ్యమంత్రి కావాలో.. ఫాంహౌస్ సీఎం కావాలో..


మాట్లాడుతున్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

- ప్రజలే తేల్చుకుంటారు
- మజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి, మహబూబాబాద్: 'కాంగ్రెస్ పాలనలో ముఖ్యమంత్రులు ప్రతిరోజూ ప్రజలకు అందుబాటులో ఉండేవారు.. కానీ ప్రస్తుత ముఖ్యమంత్రి కేసీఆర్ ఫాంహౌస్‌కే పరిమితమైన పాలన సాగిస్తున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే ముఖ్యమంత్రి కావాలో.. ఫాంహౌజ్‌లో ఉండే ముఖ్యమంత్రి కావాలో ప్రజలు తేల్చుకునేందుకు సిద్ధంగా ఉన్నారు' అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మహబూబాబాద్ జిల్లాలోని ఇల్లెందు నియోజకవర్గం బయ్యారం మండలంలోని పలువురు బీఆర్ఎస్ నాయకులు పొంగులేటి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మహబూబాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పొంగులేటి మాట్లాడారు. ముఖ్యమంత్రికి తన బాధలు చెప్పుకునేందుకు ప్రజలు, నాయకులు వెళ్తే.. ప్రగతి భవన్ ముందు నెలల తరబడి నిరీక్షించాల్సి రావడం రాష్ట్ర ప్రజలకు పట్టిన దుస్థితి అన్నారు. ప్రగతి భవన్‌కు ఒక్కటే తలుపు ఉంటుందని, అది మూస్తే ఏ ఆపద వచ్చినా.. తెరవరు.. కానీ కాంగ్రెస్ పార్టీ విశాలమైనది ప్రజలకు నాయకులు అందుబాటులో ఉండే పార్టీ అన్నారు. తెలంగాణ ప్రజల గోసను చూసిన సోనియా గాంధీ తెలంగాణ ఇస్తే అది కల్వకుంట్ల కుటుంబానికి వరంగా మారిందని అన్నారు. డిసెంబర్ 9న కాంగ్రెస్ ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేసేందుకు నాయకులు, చేయించేందుకు ప్రజలు సిద్ధంగాఉన్నారని పొంగులేటి చెప్పారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ డీసీసీ అధ్యక్షుడు భరత్ చంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొరం కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

కోర్టు ప్రాంగణంలో బతుకమ్మ సంబరాలు


బతుకమ్మ సంబరాల్లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాధాదేవి, మహిళా న్యాయమూర్తులు, న్యాయవాదులు

వరంగల్ లీగల్: జిల్లా కోర్టు ప్రాంగణంలో వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బార్ అసోసియేషన్ మహిళా కార్యదర్శి కవిత, మహిళా కార్యవర్గ సభ్యులు పద్మావతి, అరుణ నేతృత్వంలో నిర్వహించిన ఈకార్యక్రమానికి అతిథులుగా వరంగల్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి, మహిళా న్యాయమూర్తులు, న్యాయవాదులు కుటుంబ సమేతంగా హాజరై ఆనందోత్సవాలతో బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాధాదేవి, న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆనంద్‌మోహన్, యాకస్వామి, ఇతర కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.


కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన బతుకమ్మ

పాలేరుగా పని చేశా: అరూరి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరూరి రమేశ్

హసన్‌పర్తి: నియోజకవర్గ ప్రజలకు పదేళ్ల పాటు పాలేరుగా పని చేశానని వర్ధన్నపేట ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి అరూరి రమేశ్ అన్నారు. గ్రేటర్ వరంగల్ పరిధి 1, 2, 65వ డివిజన్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యుల సమావేశాన్ని చింతగట్టు క్యాంప్ సమీపంలోని కేఎల్ఎన్ గార్డెన్‌లో బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అరూరి రమేశ్ మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచార శైలి, అనుసరించాల్సిన పద్ధతులపై నాయకులతో చర్చించారు. ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి-సంక్షేమ పథకాల గురించి వివరించాలన్నారు. గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కార్పొరేటర్ దివ్యారాణి, మాజీ కార్పొరేటర్ రాజు నాయక్, జక్కుల వెంకటేశ్వర్లు, డివిజన్ అధ్యక్షుడు నరేడ్ల శ్రీధర్, ఎరుగకొండ శ్రీనివాస్, జంగా కుమార్, చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, కార్యదర్శి వెంకటేశ్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు సాగర్, నద్దునూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గుట్టుగా అబార్షన్లు



- పాలకుర్తిలో కొనసాగుతున్న దందా
- వెలుగు చూసిన ఆర్ఎంపీ దంపతుల నిర్వాకం
- క్లినిక్ సీజ్, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

పాలకుర్తి టౌన్: స్కానింగ్ సెంటర్ నిర్వాహకుల తప్పిదం ఆ తల్లిదండ్రులకు శోకాన్ని మిగిల్చింది. ఆడ శిశువని చెప్పడంతో గర్భిణికి పాలకుర్తిలో ఓ ఆర్ఎంపీ అబార్షన్ చేసి మృత మగ శిశువును బటయకు తీసిన.. భ్రూణహత్య వెలుగుచూసింది. పాలకుర్తి పట్టణానికి చెందని ఆర్ఎంపీ గుగులోతు రాములు దంపతులు కొన్నేళ్లుగా అబార్షన్లు చేస్తున్నట్లు ప్రచారంలో ఉంది. మండలంలోని దుబ్బతండా-బీ గ్రామానికి చెందని ఓ గిరిజన మహిళకు ఇద్దరు కూతుళ్లు. ఆ తర్వాత గర్భం దాల్చగా జనగామ, హన్మకొండలోని స్కానింగ్ సెంటర్లలో చూపించుకుంది. ఆడ శిశువని స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు చెప్పడంతో పాలకుర్తిలో ఆర్ఎంపీ రాములు వద్ద సోమవారం రాత్రి అబార్షన్ చేయించుకుంది. అబార్షన్ తర్వాత మగ శిశువని తెలియడంతో కుటుంబ సభ్యులు, బంధువులు శోకసముద్రంలో మునిగిపోయారు. విషయం తెలుసుకున్న జిల్లా వైద్యాధికారి ప్రశాంత్‌కుమార్ మంగళవారం వైద్య సిబ్బందితో కలిసి పాలకుర్తిలోని సదరు ఆర్ఎంపీ క్లినిక్‌ను తనిఖీ చేశారు. సదరు మహిళ ఆస్పత్రికి వచ్చిన సమయంలో తన భర్త లేకపోవడంతో అబార్షన్ చేశానని.. అప్పుడు చూస్తే మగ శిశువని తెలిసిందని ఆర్ఎంపీ భార్య డీఎంహెచ్‌ఓకు వివరించింది. ఎలాంటి అనుమతి లేకుండా అబార్షన్ చేయడంపై వైద్యాధికారి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా.. పాలకుర్తిలో ఆర్ఎంపీలు, పీఎంపీలు కొంత కాలంగా గుట్టచప్పుడు కాకుండా అబార్షన్లు చేస్తున్నా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పట్టించుకోవడంలేదని, ఫిర్యాదు చేస్తేనే స్పందిస్తున్నారని ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

క్లినిక్ సీజ్, పీఎస్‌లో ఫిర్యాదు

మహిళకు అబార్షన్ చేసి మృత మగ శిశువును బటయకు తీసిన విషయంపై డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రవిందర్, డాక్టర్ సుధీర్ విచారణ చేపట్టారు. అనంతరం పాలకుర్తిలోని ఆర్ఎంపీ నిర్వహిస్తున్న క్లినిక్‌ను సీజ్ చేసి.. నిర్వాహకుడు రాములుపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఎస్సై పి.శ్రీకాంత్‌ను వివరణ కోరగా ఫిర్యాదు అందిందని, విచారణ చేపడుతున్నామని చెప్పారు.

భవిత

ఇకపై ఈ ప్రముఖ సాక్షి ఎడ్యుకేషన్ వాట్సప్ చానల్‌లో.. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాల సమాచారం, ప్రవేశ పరీక్షలు, ఎడ్యుకేషన్ న్యూస్, టిప్స్, ఇంటర్ సమాచారం.. ఇలా ఎన్నో.. తాజా అప్‌డేట్స్ కోసం ఈ చానల్ ఫాలో అవ్వండి. ఇంకెందుకు ఆలస్యం ఇప్పుడే.. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.. చానల్ ఫాలో అవ్వండి. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

పోటీ పరీక్షల ప్రత్యేకం: తెలంగాణ హిస్టరీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

కృష్ణా జిల్లా ప్రభుత్వాసుపత్రుల్లో 52 పోస్టులు

మచిలీపట్నంలోని ఆరోగ్య వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ.. కాంట్రాక్ట్/ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన కృష్ణా జిల్లా ప్రభుత్వాసుపత్రుల్లో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 52
» **పోస్టుల వివరాలు:** ఫిజియోథెరపిస్ట్-02, స్టాఫ్ నర్స్-24, మల్టీ రిహాబిలిటేషన్ వర్కర్-08, మెడికల్ ఆఫీసర్-10, ఎల్‌జీఎస్-04, సపోర్టింగ్ స్టాఫ్-03, సెక్యూరిటీ గార్డ్-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, 10+2, సర్టిఫికేట్ కోర్సు,జీఎన్ఎం/బీఎస్సీ నర్సింగ్, బీపీటీ, ఎంబీబీఎస్ ఉత్తీర్ణులైఉండాలి.
» **వయసు:** 42 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** అకడమిక్ మెరిట్, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి కార్యాలయం, పరాసుపేట, నాయర్ బడ్డీ సెంటర్, మచిలీపట్నం, కృష్ణా జిల్లా చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 20.10.2023.
» **వెబ్‌సైట్:** krishna.ap.gov.in

అనంతపురం జిల్లా ప్రభుత్వాసుపత్రుల్లో 56 పారా మెడికల్ పోస్టులు

అనంతపురం ఆరోగ్య వైద్య,కుటుంబ సంక్షేమ శాఖ..అనంతపురం జిల్లా ప్రభుత్వాసుపత్రుల్లో కాంట్రాక్ట్/ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పారా మెడికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 56
» **పోస్టుల వివరాలు:**ఫార్మసిస్ట్ గ్రేడ్2-02, ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్2-02, రేడియోగ్రాఫర్-01, థియేటర్ అసిస్టెంట్-08, ల్యాబ్ అటెండెంట్-02, పోస్ట్ మార్టమ్ అసిస్టెంట్-03, మెడికల్ రికార్డ్ అసిస్టెంట్/రికార్డ్ అసిస్టెంట్-02, జనరల్ డ్యూటీ అటెండెంట్ జీడీఏ/ఎంఎన్‌వో/ఎఫ్ఎన్‌వో-28, ఆఫీస్ సబార్డినేట్-01, ప్లంబర్-05, ఎలక్ట్రీషియన్-01, ఆడియో మెట్రీషియన్/ఆడియోమెట్రిక్ టెక్నీషియన్-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, ఐటీఐ,డీఫార్మసీ, బీఫార్మసీ, డీఎంఎల్‌టీ, నర్సింగ్ ఆర్డర్లీ కోర్సు, డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 42 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** అకడమిక్ మెరిట్, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును అనంతపురంలోని హాస్పిటల్ సర్వీసస్ జిల్లా కోఆర్డినేటర్ కార్యాలయంలోని నిర్దిష్ట కౌంటర్లలో అందజేయాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 21.10.2023.
» **వెబ్‌సైట్:** ananthapuramu.ap.gov.in

ప్రకాశం జిల్లాలో ఈ-డివిజనల్ మేనేజర్ పోస్టులు

ఒంగోలులోని కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ కార్యాలయం.. కనిగిరి రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఈ-డివిజనల్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 01
» **అర్హత:** బీసీఏ/బీఎస్సీ/బీఈ, బీటెక్/మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగి ఉండాలి. వయసు: 21 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.22,500 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలో అందజేయాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 28.10.2023.
» **వెబ్‌సైట్:** prakasam.ap.gov.in

విజయనగరం జిల్లా హాస్పిటల్‌లో వివిధ ఉద్యోగాలు

విజయనగరంలోని డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్(డీసీహెచ్ఎస్), డిస్ట్రిక్ట్ హాస్పిటల్ ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన వివిధ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 08
» **పోస్టుల వివరాలు:** ఆడియో మెట్రీషియన్/ఆడియోమెట్రీ టెక్నీషియన్-02, జనరల్ డ్యూటీ అటెండెంట్-05, ఆఫీస్ సబార్డినేట్-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, ఇంటర్మీడియట్, బీఎస్సీ(ఆడియాలజీ), డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 42 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** అకడమిక్ మెరిట్, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును అర్హత కలిగిన సర్టిఫికేట్ జిరాక్స్ కాపీలతో పాటు జిల్లా కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్, జిల్లా ఆసుపత్రి, విజయనగరం కార్యాలయంలో అందజేయాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 25.10.2023.
» **వెబ్‌సైట్:** https://vizianagaram.ap.gov.in

జెన్‌కోలో.. ఏఈ జాబ్స్

టీఎస్ జెన్‌కో 339 అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. బీటెక్ అర్హతతో ఈ ఉద్యోగాలకు పోటీపడొచ్చు. రాత పరీక్షలో మెరిట్ ఆధారంగా నియామకం ఖరారు చేస్తారు. జెన్‌కో పరీక్ష తేదీని కూడా ప్రకటించింది. ఈ నేపథ్యంలో.. టీఎస్ జెన్‌కో ఏఈ పోస్టుల వివరాలు, అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం తదితర వివరాలు..

» 339 ఏఈ పోస్టులకు టీఎస్ జెన్‌కో నోటిఫికేషన్
» బీటెక్ ఉత్తీర్ణతతో పోటీ పడే అవకాశం
» డిసెంబర్ 3న రాత పరీక్ష
» రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగా నియామకం

తెలంగాణ స్టేట్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్.. టీఎస్ జెన్‌కోగా సుపరిచితం. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి కార్యకలాపాలను నిర్వహించే ఈ సంస్థ.. మానవ వనరుల నియామకం విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ప్రతి ఏటా ఆయా విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపడుతోంది. తాజాగా.. అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

నాలుగు బ్రాంచ్‌లు.. 339 పోస్టులు

- టీఎస్ జెన్‌కో తాజా నోటిఫికేషన్ ద్వారా మొత్తం నాలుగు బ్రాంచ్‌లలో 339 అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టులు భర్తీ చేయనున్నట్లు ప్రకటించింది.
- అసిస్టెంట్ ఇంజనీర్(ఎలక్ట్రికల్)-జనరల్ రిక్రూట్‌మెంట్-145 పోస్టులు, లిమిటెడ్ రిక్రూట్‌మెంట్- 42 పోస్టులు.
- అసిస్టెంట్ ఇంజనీర్(మెకానికల్)-జనరల్ రిక్రూట్‌మెంట్-74 పోస్టులు; లిమిటెడ్ రిక్రూట్‌మెంట్-3 పోస్టులు.
- అసిస్టెంట్ ఇంజనీర్(ఎలక్ట్రానిక్స్)-జనరల్ రిక్రూట్‌మెంట్-25 పోస్టులు.
- అసిస్టెంట్ ఇంజనీర్(సివిల్)-జనరల్ రిక్రూట్‌మెంట్-1,లిమిటెడ్ రిక్రూట్‌మెంట్-49 పోస్టులు
- నాలుగు బ్రాంచ్‌లకు సంబంధించి లిమిటెడ్ రిక్రూట్‌మెంట్ పరిధిలో 94 పోస్టులు, జనరల్ రిక్రూట్‌మెంట్ విధానంలో 245 పోస్టులు అందుబాటులో ఉన్నాయి.

విద్యార్హతలు

- ఏఈ(ఎలక్ట్రికల్): ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌తో బీటెక్ ఉత్తీర్ణులవ్వాలి. ▪ ఏఈ(మెకానికల్): మెకానికల్ బ్రాంచ్‌తో బీటెక్ ఉత్తీర్ణత ఉండాలి.
- ఏఈ(ఎలక్ట్రానిక్స్): ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఈసీఈ)/ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్/ ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ పవర్/పవర్ ఎలక్ట్రానిక్స్ బ్రాంచ్‌లలో ఏదో ఒక బ్రాంచ్‌తో బీటెక్‌లో ఉత్తీర్ణత సాధించాలి.

వయసు

జూలై 1, 2023 నాటికి 18-44 ఏళ్లు ఉండాలి. ఎస్సీ / ఎస్టీ/ ఓబీసీ(నాన్ -క్రీమీలేయర్)/ఈడబ్ల్యూఎస్ కేటగిరీ అభ్యర్థులకు గరిష్ట వయో పరిమితిలో అయిదేళ్ల సడలింపు ఇస్తారు.

వేతనం

తుది విజేతల జాబితాలో నిలిచి నియామకం ఖరారు చేసుకుంటే.. రూ.65,600-రూ.1,31,220 వేతన శ్రేణిలో ప్రారంభ వేతనం లభిస్తుంది.

ఎంపిక ఇలా

రాత పరీక్షలో మెరిట్ ఆధారంగా రిజర్వేషన్లు, లోకల్ కేడర్ తదితర నిబంధనలను అనుసరించి తుది జాబితా రూపొందిస్తారు. ఆ జాబితాలో నిలిచిన వారికి నియామకాలు ఖరారు చేస్తారు. ఆ క్రమంలో ఆయా కేటగిరీల వారీగా కనీస అర్హత మార్కుల నిబంధనను అమలు చేస్తారు. ఓసీ, ఈడబ్ల్యూఎస్, క్రీడాకారుల కేటగిరీకి చెందిన అభ్యర్థులు 40 శాతం మార్కులు; బీసీ అభ్యర్థులు 35 శాతం మార్కులు; ఎస్సీ/ఎస్టీ కేటగిరీ అభ్యర్థులు 30 శాతం మార్కులు; పీహెచ్ కేటగిరీ అభ్యర్థులు 30 శాతం మార్కులు సాధించాలి.

వంద మార్కులకు రాత పరీక్ష

- రాత పరీక్షను రెండు విభాగాలుగా 100 మార్కులకు నిర్వహిస్తారు.
- పార్ట్-ఎలో అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న బ్రాంచ్‌కు సంబంధించిన సబ్జెక్ట్ నుంచి 80 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు.
- పార్ట్-బిలో ఇంగ్లిష్, జనరల్ అవేర్‌నెస్, అనలిటికల్ అండ్ న్యూమరికల్ ఎబిలిటీ, తెలంగాణ హిస్టరీ, సంస్కృతి, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నమోదైన అభివృద్ధి, బేసిక్ కంప్యూటర్ నాలెడ్జ్ అంశాల నుంచి 20 మార్కులకు ప్రశ్నలు ఉంటాయి. రాత పరీక్షకు కేటాయించిన సమయం రెండు గంటలు.
- పరీక్షను ఓఎంఆర్ విధానంలో నిర్వహిస్తారు.

రెండేళ్ల ప్రొబేషన్, శిక్షణ

నియామకం ఖరారైన వారికి రెండేళ్ల పాటు ప్రొబేషన్, శిక్షణ విధానాన్ని అమలు చేస్తారు. తొలి ఏడాదిని శిక్షణ సమయంగా, రెండో ఏడాదిని ప్రొబేషన్ పీరియడ్‌గా పరిగణిస్తారు. ప్రొబేషన్ నిబంధనలతోపాటు.. సర్వీస్ బాండ్‌ను కూడా టీఎస్ జెన్‌కో అమలు చేస్తోంది. నియామకం ఖరారు చేసుకున్న వారు ట్రైనింగ్, ప్రొబేషన్‌లకు కేటాయించిన రెండేళ్లతో కలిపి.. మొత్తం అయిదేళ్లపాటు జెన్‌కోలో విధులు నిర్వహిస్తామని సర్వీస్ బాండ్ ఇవ్వాల్సి ఉంటుంది.



ఎస్ఈ స్థాయికి చేరుకునే అవకాశం

టీఎస్ జెన్‌కోలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా కొలువు దీరిన వారు.. భవిష్యత్తులో సూపరింటెండెంట్ ఇంజనీర్ స్థాయికి చేరుకునే అవకాశం ఉంటుంది. సర్వీసు నిబంధనలను అనుసరించి.. ఏఈ తర్వాత.. అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్, ఆ తర్వాత డివిజనల్ ఇంజనీర్, అనంతరం సూపరింటెండెంట్ ఇంజనీర్ స్థానాలకు పదోన్నతులు లభిస్తాయి. చీఫ్ ఇంజనీర్ స్థాయికి కూడా చేరుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:**అక్టోబర్ 29,2023
- **రాత పరీక్ష తేదీ:** డిసెంబర్ 3, 2023
- **రాత పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, సికింద్రాబాద్, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలో.
- **వెబ్‌సైట్:** www.tsgenco.co.in

రాత పరీక్షలో రాణించేలా

- **ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అభ్యర్థులు..** ఎలక్ట్రికల్ మెటీరియల్స్, బేసిక్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అండ్ బ్యాటరీస్, ఎలక్ట్రికల్ సర్క్యూట్స్,డీసీ మెషీన్స్, మెజరింగ్ ఇన్‌స్ట్రుమెంట్స్, ఏసీ మెషిన్స్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, పవర్ సిస్టమ్స్, ఎలక్ట్రికల్ ఇన్‌స్టాలేషన్ అండ్ ఎస్టిమేషన్, యుటిలైజేషన్ అండ్ ట్రాక్షన్, పవర్ ఎలక్ట్రానిక్స్‌కు, అనలాగ్ అండ్ డిజిటల్ ఎలక్ట్రానిక్స్, సిగ్నల్ ప్రాసెసింగ్, కంట్రోల్ సిస్టమ్, ఎలక్ట్రికల్ మెషీన్స్, పవర్ సిస్టమ్స్, పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్, పవర్ ఎలక్ట్రానిక్స్ అండ్ డ్రైవ్స్, థర్మోడైనమిక్స్, హీట్ ట్రాన్స్‌ఫర్‌కు సంబంధించిన అన్ని అంశాలపై పరిపూర్ణ అవగాహన పొందాలి.
- **మెకానికల్ బ్రాంచ్ అభ్యర్థులు..** ఇంజనీరింగ్ మెకానిక్స్, మెకానిక్స్ ఆఫ్ మెటీరియల్స్, థియరీ ఆఫ్ మెషీన్స్, వైబ్రేషన్స్, థర్మోడైనమిక్స్, ఫ్లూయిడ్ మెకానిక్స్, హీట్ ట్రాన్స్‌ఫర్, ఇంజనీరింగ్ మెటీరియల్స్, క్యాస్టింగ్, ఫార్మింగ్, జాయింగ్ ప్రక్రియలపై అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా.. కంప్యూటర్ ఇంటిగ్రేటెడ్ మాన్యుఫ్యాక్చరింగ్, ప్రొడక్షన్ అండ్ ప్లానింగ్ కంట్రోల్, ఇన్వెంటరీ కంట్రోల్, ఆపరేషన్స్ రీసెర్చ్ ఐసీ ఇంజన్స్, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండీషన్, పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్ తదితర అంశాలపై దృష్టి పెట్టాలి.
- **సివిల్ ఇంజనీరింగ్ అభ్యర్థులు..** ఇంజనీరింగ్ మెకానిక్స్, సాలిడ్ మెకానిక్స్, స్ట్రక్చరల్ అనాలిసిస్, బిల్డింగ్ మెటీరియల్ అండ్ కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్, ఫ్లూయిడ్ మెకానిక్స్, ఓపెన్ ఛానెల్ ఫ్లో, పైప్ ఫ్లో, హైడ్రాలజీ అండ్ వాటర్ రిసోర్సెస్ ఇంజనీరింగ్, వాటర్ సప్లై ఇంజనీరింగ్, వేస్ట్ వాటర్ మేనేజ్‌మెంట్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, జియో టెక్నికల్ ఇంజనీరింగ్, ఎయిర్ పొల్యూషన్, సర్వేయింగ్, ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్, పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్ విభాగాల్లోని అంశాల్లో దృష్టి పెట్టాలి.
- **ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్ అభ్యర్థులు..** నెట్‌వర్క్స్, సిగ్నల్స్, సిస్టమ్స్, ఎలక్ట్రానిక్ డివైసెస్, అనలాగ్ సర్క్యూట్స్, డిజిటల్ సర్క్యూట్స్, కంట్రోల్ సిస్టమ్స్, కమ్యూనికేషన్స్, ఎలక్ట్రో మ్యాగ్నటిక్స్, బేసిక్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెటీరియల్స్ సైన్స్, పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ మెజర్‌మెంట్స్‌కు సంబంధించిన అంశాలపై దృష్టి పెట్టాలి.
- జనరల్ అవేర్‌నెస్ అండ్ న్యూమరికల్ ఎబిలిటీ కోసం ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ ప్రాధాన్యం ఉన్న కరెంట్ అఫైర్స్‌పై పట్టు సాధించాలి. తెలంగాణకు సంబంధించి ఆర్థిక, సామాజిక అభివృద్ధిపై దృష్టి సారించాలి. తాజాగా అమలవుతున్న అభివృద్ధి పథకాలను తెలుసుకోవాలి. తెలంగాణ ప్రాంత భౌగోళిక స్వరూపం, విశిష్టతలు తెలుసుకోవాలి. ముఖ్యంగా తెలంగాణకు సంబంధించిన చరిత్రపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. తెలంగాణ తొలి ఉద్యమ దశ నుంచి తెలంగాణ ఆవిర్భావం వరకు పలు ముఖ్యమైన అంశాలను ఔపోసన పట్టాలి.వీటితోపాటు తెలంగాణ సంస్కృతి, సామాజిక పరిస్థితులు, కళలు, సాహిత్యం వంటి అంశాలను కూడా చదవాలి.

ఇటీవల కాలంలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలపై అవగాహన ఏర్పరచుకోవాలి. అనలిటికల్ ఎబిలిటీ విషయంలో గ్రాఫ్స్, డేటా అనాలిసిస్ అంశాలను ప్రాక్టీస్ చేయాలి. పదో తరగతి స్థాయిలో ఇంగ్లిష్ గ్రామర్‌ను అభ్యసనం చేయాలి.

అన్వయ దృక్పథం

ప్రిపరేషన్ సమయంలో అభ్యర్థులు అప్లికేషన్ ఓరియెంటేషన్‌తో ముందుకు సాగాలి. ముఖ్యంగా సబ్జెక్ట్ విభాగానికి సంబంధించి బీటెక్ స్థాయిలోని అకడమిక్ పుస్తకాలను ఆలంబనగా చేసుకుని ప్రిపరేషన్ సాగించాలి. మోడల్ పేపర్లు, మాక్ టెస్టులు రాయడం కూడా పరీక్షలో మెరుగైన ప్రతిభ చూపేందుకు దోహదం చేస్తుంది.